

సర్వజన బోధనాస్పత్రిలో ఎన్‌ఎంసి బృందం తనిఖీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రిని సోమవారం ఐదుగురితో కూడిన బృందం ఢిల్లీకి చెందిన నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు తనిఖీ చేసింది. ఇక్కడ మెడికల్ కాలేజీ నిర్వహణకు అనువైన వసతులు ఉన్నాయా? లేవా? ఎన్ని బెడ్లు ఏర్పాటు చేశారు? కాలేజీ నిర్వహణకు అనువైన తరగతి గదులు, తదితర పరిసరాలను పరిశీలించారు. రోగులకు ఇక్కడున్న వైద్య సదుపాయాలను, బిల్డింగ్ నిర్మాణాలను, తదితర అన్ని స్థితిగతులను వారు తిరిగి అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడేందుకు విలేకరులు ప్రయత్నించగా ఇది పూర్తిగా కాన్ఫిడెన్షియల్ ప్రోగ్రామ్ అని వివరాలు బయటకి చెప్పలేమని కాలేజీ ప్రిన్సిపల్ జమున తెలిపారు.



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న ఎన్‌ఎంసి బృందం

మంచిరోజులొస్తాయి..భయపడొద్దు

- కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందాం
- మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మంచి రోజులు వస్తాయని, ఎవరు భయపడకూడదని కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. పులివెందుల పర్యటనలో భాగంగా సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులతో మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మనం చేసిన మంచి ఉంది, మనపట్ల ప్రజలకు విశ్వాసం ఉంది, మళ్లీ ప్రజల్లోకి వస్తానని, భవిష్యత్ మనదేనని వైసిపి శ్రేణులకు జగన్ ధైర్యం చెప్పారు. వైసిపికి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ నేతలతో కూడా చర్చించారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడవద్దు, పార్టీ అండగా ఉంటుందని, అందరం కలిసి కట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని వివరించారు. రానున్న కాలంలో ప్రతి కార్యకర్తకు తనతో పాటు వైసిపి తోడుగా ఉంటుందని జగన్ భరోసానిచ్చారు. నిరంతరం ప్రజాశ్రేయస్సుకు అనుగుణంగా అడుగులు వేయాలని శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాయచోటి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, కడప మేయర్ సురేష్ బాబు, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్. అభిషేక్‌రెడ్డి, జిల్లా, నియోజకవర్గంలోని ముఖ్య నేతలు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న జగన్

ఆప్యాయంగా పలకరింపు

జగన్ కలిసేందుకు జిల్లా వ్యాపంగా జనం తరలివచ్చారు. ఆప్యాయంగా పలకరిస్తూ వారి నుంచి వినుతులను స్వీకరించారు. పులివెందులకు భారీగా తరలివచ్చిన వైసిపి శ్రేణులనలు ఓపికతో పలకరించి సమస్యలు తెలుసుకున్నారు. ధైర్యంగా ముందుకు వెళ్లాలని భరోసా ఇచ్చారు. పులివెందులలోని క్యాంపు కార్యాలయం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది.



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

ముగిసిన జగన్ పర్యటన

మాజీ ముఖ్యమంత్రిగా పులివెందులకు వచ్చిన జగన్ మోహన్‌రెడ్డి మూడు రోజులపాటు వైసిపి శ్రేణులు, అభిమానులతో ఆప్యాయంగా పలకరిస్తూ వారి నుంచి వినతులను స్వీకరించారు. జగన్ కలిసేందుకు మూడు రోజులపాటు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. సోమవారం మధ్యాహ్నం వరకు ప్రజాధర్బార్ నిర్వహించిన జగన్ మోహన్‌రెడ్డి ఆయన సతీమణి భారతి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా బెంగళూరులోని వారి నివాసానికి చేరుకున్నారు.

ముఖ్య నాయకులపై ఆగ్రహం

వైసిపి ముఖ్య నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తుంది. పులివెందుల నియోజకవర్గం అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశామని, కానీ పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా వేరే వారికి పనులు కట్టబెట్టారని పలువురు ఆరోపించడంతో దీనిపై ముఖ్య నేతలను మందలించినట్టు తెలుస్తుంది. వందల కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉంటే ఎందుకు తన దృష్టికి తీసుకు రాలేదని ఆ నేతలపై అసహనం వ్యక్తం చేశారు.

ప్రజలు ఓడించినా వైసిపికి ఆశ చావలేదు :'చమర్తి'



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రజలు వైసిపిని ఘోరాతి ఘోరంగా ఓడించినప్పటికీ ఆ పార్టీ నాయకులు మాత్రం ప్రజాధనాన్ని అక్రమ, మైనింగ్, ఇసుక లూటీ చేయడం ఆపలేదని, ఇటువంటి దుశ్చర్యలను వైసిపి నాయకులు మానుకోవాలని, అధికారులు కూడా వారి అడుగులకు మడుగులు ఒత్తడం మానుకోవాలని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు చెప్పిన మాట ప్రకారం పెంచిన పెంపుతో సహా అదనంగా గడిచిన మూడు నెలలకు రూ.3 వేలు కలిపి రూ.7 వేలు మొత్తాన్ని ఒకటో తేదీ నాడే పింఛన్దారులకు అందిస్తామని పేర్కొన్నారు. పేద ప్రజల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యంగా గత ప్రభుత్వం మూసివేసిన అన్న క్యాంటీన్ మరలా పునః ప్రారంభిస్తూ పేద ప్రజలకు కడుపునిండా అన్నం పెట్టాలనే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమన్నారు. ఆర్అండ్‌బి అతిథి గృహం ఎదురుగా వున్న అన్న క్యాంటీన్ భవనాన్ని మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించి అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంబాబు, ఎఇనారాయణ, విఆర్ఒ సుబ్రహ్మణ్యం, టిడిపి పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, పార్లమెంటు అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు, కౌన్సిలర్లు రాజేష్, మనుబోలు వెంకటసుబ్బయ్య, ఎపిఆర్‌డిసి మాజీ డైరెక్టర్ గుల్జార్‌బాష, తెలుగు యువత పార్లమెంట్ అధికార ప్రతినిధి సింగన పరుశురాం నాయుడు, పార్లమెంట్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు, రాజంపేట మండల పార్టీ ఉపాధ్యక్షులు ఆర్.సతీష్ కుమార్ రాజు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు జడ శివకుమార్, నాయి బ్రాహ్మణ రాష్ట్ర నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు, రైతు

నష్టపోయిన రైతును ఆదుకోవాలి

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ శీలంవారిపల్లికి చెందిన కౌలు రైతు గుర్రంకొండకు చెందిన విఘ్నేశ్వర ఫర్టిలైజర్ షాప్‌లో 52/34 నాగార్జున కంపెనీ డ్రిప్ సంచిని కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోయాడని, రైతును ఆదుకుని, నకిలీ డ్రిప్ సంచిన అమ్మిన షాప్ యజమానిపై కేసు నమోదు చేసి, షాప్ లైసెన్స్ రద్దు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ డిమాండ్ చేశారు. రైతును ఆదుకోవాలని కోరుతూ సోమవారం గుర్రంకొండ విఘ్నేశ్వర ఫర్టిలైజర్ షాప్ వద్ద రైతు రెడ్డిశేఖర్‌తో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటిన్నర ఎకరా కౌలు భూమిలో రూ.3.5 లక్షలు ఖర్చు చేసి టమోటా పంట సాగు చేశాడన్నారు. విఘ్నేశ్వర ఫర్టిలైజర్ షాప్‌లో 52/34 నాగార్జున కంపెనీ డ్రిప్ సంచిని కొనుగోలు చేసి టమోటా పంటకు డ్రిప్ ద్వారా కొట్టాడని పేర్కొన్నారు. నకిలీ మందు కారణంగా టమోటా పంట రాలిపోయి ఎరుపెక్కి మొత్తం పంటను రైతు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో నకిలీ మందులు అమ్ముతున్న ఫర్టిలైజర్ షాపులపై విజిలెన్స్ అధికారులు నిఘా లేని కారణంగా రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. నష్టపోయిన రైతును ఆదుకోవాలని, నకిలీ మందులు అమ్మిన విఘ్నేశ్వర ఫర్టిలైజర్ షాపును సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మురళి, రైతులు పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న : 'చింతల'


ప్రజాశక్తి-వాల్మీకిపురం

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కొత్తపేటవీధిలోని సాయినారాయణ సేవ ట్రస్ట్ భవనం వద్ద వృద్ధులు, వికలాంగులు, అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ సాయి నారాయణ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్యక్రమం గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా పెళ్లి, పుట్టిన రోజు వేడుకలు జరుపుకునే వారు సాయి నారాయణ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుపుకొని, ఆకలితో ఉన్న వారికి అన్నదానం, సాయంత్రం బ్రెడ్డు, పాలు అందించడం వలన ఎంతో మందికి ఆకలి తీరుతుందన్నారు. మనకున్నంతలో తోటి వారికి సాయం చేయడం ద్వారా జీవితానికి తగిన సార్థకత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకట్రమణ, ఉపసర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, నాయకులు నీళ్లభాస్కర్, సురేష్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, లక్ష్మన్న, రమణ, రెడ్డెప్ప రెడ్డి, అంజి, విశ్వనాథ్, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి, ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలో రూ.1.80 లక్షలు మాయం

- సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు రమేష్

ప్రజాశక్తి-పీలేరు



జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి రమేష్ తన బ్యాంకు ఖాతాలో నుంచి రూ.1.80 లక్షలు మాయమయ్యాయి. సోమవారం బాధితుడు తెలిపిన వివరాల మేరకు... పీలేరు పట్టణం, తిరుపతి రోడ్డులోని చౌడేశ్వరి నగర్‌లో నివాసమున్న జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి సిప్పాల రమేష్ కు పట్టణంలోని బరోడా బ్యాంకులో ఖాతా ఉంది. రమేష్ సెల్ ఫోన్‌లోని 8897222456 నెంబరు సిమ్ గత ఆరు రోజులుగా పనిచేయలేదు. దాన్ని సరిచేయడం కోసం స్థానికంగా సెల్ షాపులో ఇచ్చాడు. తరువాత అదే నెంబర్తో శనివారం కొత్త సిమ్ము తీసుకున్నాడు. మధ్యలో ఆదివారం రావడంతో సోమవారం తన సిమ్ పని చేయడం మొదలైంది. ఆ వెంటనే తన బ్యాంక్ ఖాతాలొంచి రూ.1.80 లక్షలు డ్రా చేసినట్లుగా మెసేజ్ రావడంతో రమేష్ ఖంగు తిన్నాడు. ఆ వెంటనే స్థానిక బరోడా బ్యాంక్ మేనేజరును కలిసి పరిస్థితి వివరించాడు. ఆయన ఇది తమ పరిధిలోకి రాదని, సైబర్ క్రైమ్ కు ఫిర్యాదు చేయాలని సూచించినట్లు తెలిపారు. తరువాత పీలేరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన వారు సైబర్ క్రైమ్ ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించినట్లు చెప్పారు. తన కుమారుడి వివాహం కోసం వడ్డీకి తెచ్చుకున్న రూ.6 లక్షల నుంచి రూ.1,80,000 మాయం అవడంతో దిక్కుతోచడం లేదన్న ఆవేదనను వ్యక్తం చేశారు. సైబర్ క్రైమ్ అధికారులు, బ్యాంక్ అధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు.

ఫిర్యాదులను వంద శాతం పరిష్కరించాలి

- కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్

ప్రజా శక్తి రాయచోటి

ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని పటిష్ఠంగా నిర్వహించి మొదటి ప్రాధాన్యతగా వందశాతం పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.అభిషిక్త్‌కిషోర్ పేర్కొన్నారు. రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సోమవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పిజిఆర్ఎస్) కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్‌డిసి రామసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎన్నికల అనంతరం మళ్లీ ప్రారంభించామని తెలిపారు. ప్రతి సోమవారం కార్యక్రమాన్ని ఎంతో సీరియస్‌గా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. గతంలో స్పందనలో ఏవైతే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పెండింగ్‌లో ఉన్నాయో వాటిని కార్యక్రమానికి బదిలీ చేశామన్నారు. అప్పటి లాగిన్ ఐడీలతోనే ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఆన్‌లైన్ సిస్టంలో లాగిన్ అయ్యి ఫిర్యాదులను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంపై ప్రభుత్వం చాలా ఎక్కువ ఫోకస్ పెట్టిందని తెలిపారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేసే అవకాశం కూడా ఉంది. ప్రతి గ్రీవెన్సును, ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందిన్నారు. పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్-ఎల్ఎ దరఖాస్తులు వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారో వారి సమస్యను సావధానంగా విని, ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, వాటిని బాధ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ఏవైనా తమ పరిధిలో పరిష్కారం చూపలేని వాటిని తనపై ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా మండల, డివిజన్ ప్రధాన కేంద్రాలలో క్షేత్రస్థాయిలో కూడా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి బాధ్యతగా చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



నిమ్మనపల్లె : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమనిఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. వీధిలైట్లు ఏర్పాటు, కాలువలు శుభ్రం చేయడం వంటి పనులను అధికారులు సమన్వయపరచుకొని పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఎవరు ఇలాంటి సమస్య మీద కార్యాలయానికి వచ్చినా పెడచెవిన పెట్టకుండా, నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వారి సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహించిన అలసత్వం ప్రదర్శించిన కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపిడిఒ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఎంపిపి రెడ్డమ్మ, వెలుగు చంద్ర, సిటిఎం సర్పంచ్ ఆనంద పార్థసారథి పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : మొదటిసారి నిమ్మనపల్లి పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు మండల పరిధి నుంచి అడుగడుగునా ఆయనకు తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. స్థానిక బస్టాండ్ వద్ద సర్పంచ్ పాపులమ్మ భర్త మల్లప్ప పూల మాలలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. బస్టాండ్ నుంచి కార్యకర్తలతో ర్యాలీగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంకు చేరుకున్నారు. ఎంపిపి నరసింహులు, ఎంపిడిఒ షాలేట్, తహవీల్దార్ బాలాజీ రాజు, ఎపిఎం రజనీకుమారి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్యేకంగా పంచాయతీ కార్యదర్శులను గ్రామాలలో మౌలిక వసతులు మెరుగుపరచడానికి తీసుకోవలసిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రతిరోజు శుద్ధమైన తాగునీరు అందించాలని, మురుగునీటి కాలువలను శుభ్రపరచాలని, విద్యుత్ దీపాలు తప్పనిసరిగా వెలగాలని సూచించారు. సిసి రోడ్లు నిర్మాణం, ఇతర సౌకర్యాలు ఏర్పాటుపై అధికారులకు తగిన సూచనలు చేశారు. ఎక్కడైనా పారిశుధ్యం సమస్యలు తలెత్తితే సంబంధించిన అధికారులపై చర్యలు చేపడతామని తెలిపారు. నిమ్మనపల్లిలో గ్రంథాలయం ఏర్పాటు చేయడానికి అనువైన స్థలం చూపించాలని పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి కోరగా, ఐదు సెంట్ల స్థలాన్ని పట్టణంలో తక్షణం చూపించాలని, లైబ్రరీ ఏర్పాటు చేయడానికి సహకరించాలని తహశీల్దారును కోరారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'నీతి తప్పిన రాజకీయాలు ఎప్పుడూ చేయలేదు'

ప్రజాశక్తి-రాయచోటి

నీతి తప్పిన రాజకీయాలు తను ఎప్పుడూ చేయలేదని టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్‌వల్లి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని 4వ వార్డు వైసిపి కౌన్సిలర్ కొలిమి హరూన్‌బాషా తనపై అసత్య ఆరోపణలుచేయడం తగదన్నారు. హరూన్ బాషా కుటుంబం హత్యా రాజకీయాలు చేస్తుందన్నారు. జూదం ఆడిస్తూ, హత్యకు ప్రేరేపించే ఆయుధాలను పెట్టుకునే వారు తన గురించి మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. మున్సిపల్ ఎన్నికలలో తన తల్లిని కింద కూర్చోబెట్టి అవమానపరిచారని వాపోయారు. వైసిపిలో ఉంటూ టిడిపి ఎమ్మెల్సీ ఎన్నికలలో తన మద్దతు మీకే అంటూ టిడిపి క్యాంపులో బిటెక్ రవి వద్ద రూ.10 లక్షలకు అమ్ముడు పోలేదా అని ప్రశ్నించారు. మార్కెట్ యార్డ్ పదవి కోసం ఒక నాయకుని పంచన చేరి పదవి పొందిన వెంటనే నమ్మిన వాడిని మోసం చేశారని ఆరోపించారు. ఒక దర్గాకు సంబంధించిన ఆస్తులు, ఆదాయ విషయంలో త్వరలోనే విచారణ చేయిస్తామన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసిపి తనపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మాజీ శాసన సభ్యులు పలుమార్లు ఫోన్ చేసి తగిన గుర్తింపు ఇస్తామన్నా సున్నితంగా తిరస్కరించానని అన్నారు. ఇప్పటికైనా తనపైన ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

మల్లయ్య కొండపై భక్తుల తాకిడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. పూజారులు, ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. కొండపైన భక్తులకు అన్నదానం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓబయ్య

కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం : సిఐటియు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కార్మిక సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని నూతనంగా ఎన్నికైన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సి.హెచ్.ఓబయ్య, ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ అన్నారు. సోమవారం ఆర్అండ్‌బి బంగ్లాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఇటీవల రాయచోటిలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నామన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పి.వి.రమణ, ఉపాధ్యక్షులుగా సి.హెచ్ ఓబయ్య, డి.లక్ష్మీదేవి కె.ప్రసాద్, సహాయ కార్యదర్శిగా పి.విజయ్ కుమార్, వై.ఏడుకొండలు, ఎం.రెడ్డయ్య, జిల్లా కమిటీ సభ్యులుగా ఎం.గంగయ్య ఎ.బాలాజీ, ఎస్.సురేష్, ఎం.మధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని, కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలపై పోరాడుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలో వర్షాకాలంలో విజృంభించే సీజనల్ వ్యాధుల పట్ల గ్రామాలలో అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు తాగునీరు, పారిశుద్ధ్యంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేసి గ్రామాలలో తాగునీటి సమస్య, కలుషితానికి కారణాలు పారిశుధ్యం లోపం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ఈ వర్షాకాలంలో తాగునీరు కలుషితమై పారిశుధ్య లోపంతో డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రభలే అవకాశం ఉంటుందంటారు. తాగునీటి బోర్ల వద్ద మురుగునీటి కుంటలు ఉంటే వాటిని పూడ్చాలన్నారు. గ్రామాల్లో ప్రజలను చైతన్య పరచాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి అశోక్ కుమార్ పాల్గొన్నారు.



సిబ్బందికి కిట్లు అందజేస్తున్న ఎంపిడిఒ కృష్ణమూర్తి

ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన కాంతారావు

- మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోల్లపల్లి ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు కాంతారావు ఉపాధ్యాయ వృత్తికి వన్నె తీసుకొచ్చారని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. సోమవారం కాంతారావు పదవీ విరమణ కార్యక్రమాన్ని తోటి ఉపాధ్యాయులు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీతోపాటు మదనపల్లి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు గంటా మోహన్, పోకల మధుసూదన్, భాస్కర్‌రెడ్డి, సోమశేఖర్, ఖాదర్ వలి, రమేష్, భాస్కర్ నాయుడు బి.కొత్తకోట మండల విద్యాశాఖ అధికారులు రెడ్డిశేఖర్, భీమేశ్వరచారి, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రెడ్డి, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, కురబలకోట మండల విద్యాశాఖ అధికారులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ కాంతారావు వృత్తినే దైవంగా భావించి, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. 2017లో గోల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టి పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ దుర్గరాజు కాంతారావు ఎంతోమంది ఉపాధ్యాయులుకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఆయన శేష జీవితం సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కాంతారావు దంపతులను గజమాలతో సత్కరించారు. తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం ఇచ్చేటువంటి అన్ని సౌకర్యాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో గోల్లపల్లి హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాంతారావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



ఎపి స్టూడెంట్స్ జెఎసి నాయకులు

ఎపి స్టూడెంట్స్ జెఎసి జిల్లా అధ్యక్షులుగా గంగరాజు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా గంగరాజు ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జెఎసి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నూతన కమిటీల ఏర్పాటులో భాగంగా సోమవారం మదనపల్లెలో స్థానిక విశ్వహిత డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా గంగరాజు నియమిస్తున్నట్లు ఎపి స్టూడెంట్ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా హేమాద్రి యాదవ్ మాట్లాడుతూ స్టూడెంట్ జెఎసి సమైక్యాంధ్ర ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ప్రత్యేక హోదా, విభజన హామీ చట్టంలోని అంశాలపై ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి పార్లమెంట్‌లో సంఖ్యబలం అధికంగా ఉండడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలు, ఉద్యమ గొంతు నొక్కేశారన్నారు. మళ్లీ మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ఇతర పార్టీలపై ఆధారపడి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ తరుణంలో తిరిగి రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ కమిటీలు మళ్లీ బలపరిచి మరోసారి ప్రత్యేక హోదా ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. ప్రతి జిల్లాలో నూతన కమిటీలు వేస్తూ విభజన హామీ చట్టాలన్నీ అమలు పరిచేలా ఒత్తిడి తెస్తామన్నారు. రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఐఐటిలు, పరిశ్రమలు అన్నీ స్థాపించాలని డిమాండ్ చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. స్టూడెంట్స్ జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తన్న మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు అలుపెరగని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గంగరాజు, మదనపల్లె నియోజకవర్గ అధ్యక్షులు నరసింహులు, తిరుపతి జిల్లా అధ్యక్షులు గార్లపాడు శ్రీధర్, ఇతర ఎపి స్టూడెంట్స్ జెఎసి నాయకులు గణేష్, నారాయణ, ప్రదీప్, పురుషోత్తం, మల్లికార్జున, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంతతోపు గంగమ్మ జాతరపై చాటింపు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

తంబళ్లపల్లి సమీపంలో వారపు సంత తోపులో వెలసిన శ్రీ కోటకొండ గంగమ్మ జాతర బుధవారం, గురువారం రెండు రోజులపాటు నిర్వహిస్తామని పూజారి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పోతుల రాజు నృత్యాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తూ జాతర చాటింపు చేశారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో అమ్మవారి ప్రత్యేక పూజలు అభిషేకాలతో మొక్కులు తీర్చుకొని జాతరను విజయవంతం చేయాలని కోరారు.

యువకుడి రక్తదానం

ప్రజాశక్తి - బి.కొత్తకోట



రక్తదానం చేస్తున్న యువకుడు

అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి అవసరమైన రక్తాన్ని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు పి.సత్య నారాయణరెడ్డి దానం చేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తగాది రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ కదిరిలో నివాసముండే నాగే శ్వరరెడ్డి అనే వ్యక్తి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. అతని వైద్యానికి రక్తం అవసరం కాగా, వారి కుటుంబ సభ్యులు తమ ఫౌం డేషన్‌ను ఆశ్రయించారన్నారు. తమ ఫౌండేషన్ సభ్యుడైన పి.సత్య నారా యణరెడ్డి రక్తాన్ని అందించారన్నారు. సమాజ సేవా కార్యక్రమాల్లో యంగ్ ఇండి యా సేవా ఫౌండేషన్ ఎల్లవేళలా ముందుంటుందన్నారు.ఎవరికి ఏ అవసరం వచ్చినా మా ఫౌండేషన్ ని సంప్రదించవచ్చునని స్పష్టం చేశారు.

వేధింపుల నుంచి విముక్తి కల్పించండి

ప్రజాశక్తి - కడప అర్బన్

రిటైర్డ్ ఎస్ఐ పెంచలయ్య వేధింపుల నుంచి తమకు విముక్తి కల్పించి, తమపై నమోదు చేయించిన తప్పుడు కేసులను ఉపసంహరించేలా చూడాలని బాధితురాలు కృష్ణవేణి కోరారు. సోమవారం వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి తన కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడారు. ఎనిమిదేళ్ల కిందట తాము ఏడు బస్సులను కొనుగోలు చేశామన్నారు. అప్పుడు ఆర్థికంగా చేతి బదులుగా కొంతమేర నగదు ఇచ్చిన రిటైర్డ్ ఎస్ఐ పెంచలయ్య కొంతకాలంగా ఆ బస్సులను తనకు ఇచ్చేయాలని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. బస్సుల కొనుగోలు సమయంలో ఇచ్చిన డబ్బును ఇచ్చేస్తామని చెప్పినప్పటికీ పట్టించుకోకుండా, తమ భర్త రవిశివశంకర్‌తోపాటు, తమ కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు నమోదు చేసి పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారన్నారు. ప్రస్తుతం ఒక బస్సును తిరగకుండా ఆపివేయడంతోపాటు పోలీసు సమయంలో ఉన్న పరిచయాలను అడ్డుపెట్టుకుని తమను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాడన్నారు. ఈ విషయంలో తమకు తగిన న్యాయం చేసి ఆదుకోవడంతోపాటు రిటైర్డ్ ఎస్ఐ పెంచలయ్య దౌర్జన్యాల నుంచి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు ఆర్థిక సాయం అందించాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఆర్థిక సాయం అందించాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి సూచించారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందన్నారు. ఇప్పటికే ఏరువాక పౌర్ణమి కూడా అయిపోయిందని తెలిపారు. వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయని, రైతు లకు ఆర్థికంగా అవసరాలున్నాయని తెలిపారు. ప్రతి రైతు కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని టిడిపి తన ఎన్నికల మేనిఫెస్టోలో, బాబు ష్యూరిటీలో పెట్టారని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా వెంటనే కేంద్ర ప్రభుత్వం ఏడాదికి ఇచ్చే రూ.6 వేలతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే ప్రతి రైతు కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. కౌలు రైతులను కూడా ఆదుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం అన్న క్యాంటీన్లు పునరుద్ధరించడం హర్షణీయమని, గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం ఎక్కువగా ఉందన్నారు.

మహారాజశ్రీ రాజంపేట సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.No.37/2019 in O.S No.34/2013

[illegible]

//జె ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

వి వల్లభరావు

పిటిషనర్ తరఫు న్యాయవాది, రాజంపేట, అన్నమయ్య జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.

మేలురకం వేరుశనగ విత్తనంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-వీరబల్లి



మండలంలో ముందస్తుగా వర్షాలు కురుస్తున్నందున రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ పంట వేయడానికి దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాధారంగా సాగు అయ్యే పంటకు బహుళ ప్రయోజనాల కోసం లోతు దుక్కులు, అధిక దిగుబడులకు మేలు రకం విత్తనాల ఎంపిక, అవసరమైన ఎరువుల యాజమాన్యం, ఎంతో అవసరమని వ్యవసాయ శాఖ అధికారిని ఎం. స్వాతి సూచించారు. మండలంలో వేరుశనగ సాగు 400 ఎకరాలు సాధారణ సాగు విస్తీరంగా ఉంది. ప్రస్తుతం అప్పుడప్పుడు వర్షాలు కురుస్తుండడంతో రైతులు దుక్కులు చేసే పనిలో నిమగ్నమయ్యారు. గింజ పరిమాణం, నూనె శాతంతో పాటు మొలక శాతంపై ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి ధ్రువీకరించిన విత్తనాన్నే ఎంపిక చేసుకోవాలి. విత్తనం జన్యు స్వచ్ఛతలో అసలు గుణాలను కలిగి, పంట మొత్తం సారూప్యతతో అధిక దిగుబడి సామర్థ్యం కలిగి ఉండాలి. వేరుశనగ విత్తనాలు తేమ 8-9 శాతం వరకే ఉండాలి. అంతకు మించితే సీలీంద్రాలు, పురుగులు వృద్ధితో మొలక దశలో తెగుళ్లకు అవకాశం ఉంది. బరువైన దృఢమైన విత్తనాలన్నీ సమంగా మొలకెత్తి శక్తివంతంగా పెరుగుతాయి.

శుద్ధి కీలకం.. : మొదట 2 మి.లీ ఇమిడా క్లోఫ్రీడ్‌ను కిలో విత్తనానికి కలిపి అరగంట ఆరబెట్టాలి. తర్వాత విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ పొడి, లేదా ఒక గ్రాము టేబ్యూకోనజోల్ 2డి ఎస్ పొడి ముందు ట్రైకోడెర్మా విరిడి 8 గ్రాముల పొడి మందును పట్టించాలి. వేరు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే కిలో విత్తనానికి 6 మి.లీ ఫ్లోరి పైరిపాస్, లేక 2 మి. లీ ఇమిడా క్లోరిఫిడ్ చొప్పున కలిపి శుద్ధి చేసుకోవాలి. విత్తనాన్ని మొదట క్రిమి సంహారక మందుతో శుద్ధి చేసి ఆరబెట్టిన తర్వాత అవసరమైతే రైజోబియం నుకూడా విత్తనాలకు పట్టించవచ్చు. విత్తనానికి నిద్రా వస్థను తొలగించేందుకు 5 మి. లీ ఇథరిల్ 100 శాతం ను10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణంలో 12 గంటలు నానబెట్టి తర్వాత నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి అని వ్యవసాయాధికారి ఎం.స్వాతి పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి : ఎంపిపి



ఆర్‌టిసి అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ నాగిరెడ్డి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని ఎంపిపి లక్ష్మీనరసమ్మ అన్నారు. సోమవారం ఎంపిడిఒ నూర్జహాన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చొరవచూపాలని ఆదేశించారు. ఎంపిడిఒ నూర్జహాన్ మాట్లాడుతూ హాజరైన అధికారులు తమ నివేదికలు వివరించాలని కోరగా అధికారులు వారి వారి నివేదిక విధానాన్ని తెలియజేశారు. ఆర్‌టిసి వారి తీరుపై ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. మదనపల్లి-బి.కొత్తకోట నడుస్తున్న బస్సులు విద్యార్థుల కోసం పల్లెల్లో నిలపడం లేదని, పలుమార్లు మండల సర్వసభ సమావేశంలో తెలిపిన పరిష్కారం చేస్తామని వెళ్ళిపోతారు గానీ, సమస్యను పరిష్కరించలేదన్నారు. ఎవరో ఒకరు మండల సర్వసభ సమావేశానికి వస్తారు, పరిష్కరిస్తామని వెళ్తారు తప్ప పరిష్కరించటలేదని సర్పంచ్ నాగిరెడ్డి తన అసహాన్ని వ్యక్తం చేశారు. మదనపల్లి ఆర్‌టిసి డిపో డిఎం స్పందించుకుంటే ప్రజానాయకులంతా ఆర్‌టిసి అధికారులు నిర్లక్ష్యం వీడకుంటే మండల సర్వసభ సమావేశాన్ని బహిష్కరిస్తామని సర్పంచ్ నాగిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఖాదర్‌వలీ, విద్యుత్ శాఖ ఎఇ గిరిధర్, మండల విద్యాశాఖ అధికారులు రెడ్డిశేఖర్, భువనేశ్వరచారి, హౌసింగ్ ఎఇ లావణ్య, ఉపాధి హామీ శాఖ మంజుల, పశువైద్యశాల డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు. కాగా సర్వసభ్య సమావేశానికి ఆరుగురు ఎంపిటిసిలు తప్ప మిగిలిన వారు హాజరు కాలేదు. ఎంపిపిపై అసంతృప్తితో ఉన్నారని, ఆమెపై అవిశ్వాస తీర్మానం నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.

సాంకేతిక విద్యతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు

- పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-కలికిరి



ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు



పాలిటెక్నిక్ కళాశాల భవనం

సాంకేతిక విద్యతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పాలిటెక్నిక్ కళాశాల కలికిరి ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలు దొరకకపోవడంతో ఇబ్బంది పడుతున్న యువతకు సాంకేతిక విద్య ఎంతో దోహదం చేస్తుందని అందువలన ఎక్కువ మంది యువత సాంకేతిక విద్య వైపు చూస్తున్నారని ఆయన తెలిపారు. కలికిరి పాలిటెక్నిక్ కళాశాలలో ఉత్తమమైన సాంకేతిక విద్యను అందిస్తున్నామని, ఇసిఇ, ఇఇఇ వంటి కోర్సులు నైపుణ్యం గల అధ్యాపకులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని. ఇక్కడ విద్యను అభ్యసించిన విద్యార్థులు ఎంతోమంది ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాలు పొంది ఉన్నత స్థానాలను అధిరోహించాలని తెలిపారు. అందువల్లే మాకు ఈ కళాశాలకు ఎన్‌సిబి (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్) సంస్థ నుండి గుర్తింపు పొందిందడం గర్వించదగ్గ అంశమని పేర్కొన్నారు. 20 23-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పాస్ అయిన విద్యార్థిని విద్యార్థులు సాంకేతిక విద్య కోర్సులను ఎంపిక చేసుకుని తన ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు.

వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలి




ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బలిజల ఐక్యత పెంపు కోసం, బలిజ పిల్లల వివాహాల కోసం శ్రీకృష్ణదేవరాయ కాపు సేవాలయ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు సొసైటీ నిర్వాహకులు నరసయ్య తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలిజ కులస్తుల పిల్లలు ఎంతో ఉన్నత చదువులు చదువుకున్నప్పటికీ మంచి ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ వివాహాలు మాత్రం ఆలస్యం అవుతున్న విషయాన్ని గుర్తించామన్నారు. తల్లిదండ్రులు వయసు రీత్యా తిరగలేకపోవడం, పని ఒత్తిడి, ఉద్యోగరీత్యా, వివాహాల కార్యం ఆలస్యం అవుతుండడంతో తాము ఈ బృహత్కార్యానికి ముహూర్తం నిర్ణయించి సొసైటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సొసైటీ ద్వారా బలిజ కులస్తులను ఏకం చేసి, వారి పిల్లలను కుటుంబ సభ్యులను అందరినీ ఒక్కచోట చేర్చి ఒకరి గూర్చి మరొకరు నేరుగా తెలుసుకునేలా ఈ పరిచయ వేదికను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ వివాహ పరిచయ వేదిక ద్వారా ఒకరినొకరు నేరుగా కలవడం ద్వారా పిల్లలకు మంచి సంబంధాలు కుదురుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 30వ తేదీ స్థానిక సిఎస్ఐ జెసిఎం కమ్యూనిటీ హాల్‌లో బలిజ కులస్తుల ఉచిత వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మదనపల్లె నియోజకవర్గంతో పాటు రాయచోటి, తంబాలపల్లె, వాయల్పాడు, పుంగనూరు, పలమనేరు, కుప్పం తదితర తెలుగు రాష్ట్రాల్లోని అన్ని నియోజకవర్గాల వారు ఈ పరిచయ వేదిక వస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేశామని బలిజల ఐక్యతతో పాటు పిల్లల భవిష్యత్తు కొరకు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు నరసయ్య, పవన్ తేజ కోరారు. అనంతరం ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దారం అనిత, హరి, జంగాల శివరాం, నాగభూషణం పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని ఇందిరమ్మ కాలనీ వాసులు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ తమ కాలనీలో సుమారు 500 కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నామని తెలిపారు. ఆరు నెలలుగా మంచినీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అందరూ కూలీ నాలి చేసుకొని జీవనం చేసేవారమేనన్నారు. మంచినీటి కోసం సంపాదనలో సగం డబ్బులు నీళ్ల ట్యాంకర్లకే ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రయివేటు ట్యాంకర్లకు దొరుకుతున్న నీళ్లు ప్రభుత్వ పంచాయతీ అధికారులకు ఎందుకు దొరకడం లేదని నిలదీశారు. కేవలం నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరించడం వల్ల తమకు నీటి సదుపాయం అందడం లేదని వాపోయారు. అంతేకాకుండా వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదని, రోడ్డు సౌకర్యం లేదని, మురుగునీటి కాలువలు లేవని తెలిపారు. దీంతో విషసర్పాలు ఇళ్ళ ముందరే తిరుగుతుండడంతో తీవ్ర దుర్భర కరమైన వాతావరణంలో జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. రోడ్డు సౌకర్యం సరిగా లేనందున పిల్లలను బడికి పంపేందుకు కూడా ఆటో సౌకర్యం లేక ఆపసోపాలు పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అనంతరం సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జి తోపు కృష్ణప్ప మాట్లాడుతూ కాలనీలో వసతుల కల్పన కోసం, మంచినీటి సౌకర్యం కోసం ఎన్నిసార్లు అధికారులను సంప్రదించినా ప్రయోజనం శూన్యమన్నారు. ఇంటి పన్నులు కట్టించుకునే అధికారులు మంచినీళ్లు ఉవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు వసతుల కల్పనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తాము ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపిడిఒ భానుప్రకాష్, ఎంపిపి రెడ్డెమ్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్ బాషను కలిసి కాలనీలోని సమస్యలపై ఏకరువు పెట్టారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ఒక్క అభివృద్ధి పని జరగలేదని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే నీటి కుళాయిలు ఏర్పాటు చేసి మంచి నీటి సౌకర్యం అందిస్తామని, త్వరలోనే అన్ని వసతులు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చంద్రశేఖర్, సాంబశివ, మురళి, కాలనీవాసులు షబానా, శారదమ్మ, షకీలా, రాజి, కమలమ్మ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఇందిరమ్మ కాలనీ వాసులు

సిఆర్‌పిలకు రాత పరీక్ష

ప్రజాశక్తి-తంబళ్లపల్లె : స్థానిక శ్రీ శక్తి భవన్లో సిఆర్‌పిల ఎంపికకు సోమవారం రాత పరీక్ష నిర్వహించారు. ఎన్ఆర్ఎల్ఎం సెల్ఫ్ ఆధ్వర్యంలో వ్యవసాయేతర, జీవనోపాదులు ఉప పథకాల అమలుకు సిఆర్‌పిలను ఎంపిక చేస్తున్నట్లు డిపిఎం రుతు తెలిపారు. నియోజకవర్గంలోని తంబళ్లపల్లె పెద్దమండ్యం, మొలకలచెరువు, పెద్దతిప్ప సముద్రం, కురవలకోట బి.కొత్తకోట మండలాల నుంచి 70 మంది రాత పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. 4 గ్రామ పంచాయతీలకు కలిపి ఒక సిఆర్పిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. రాత పరీక్షలో అర్హత సాధించిన వారిని ఎంపిక చేసి పథకాల అమలుకు శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిఎం గంగాధర్, సిసిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రజా సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించారు ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో ఏర్పాటు చేసిన మండల సమావేశానికి జడ్‌పిటిసి రమాదేవి, ఎంపిడిఒ వెంకటరమణ రెడ్డి లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమస్యలపై ఆరా తీశారు. రైతులకు అదనంగా విత్తన కాయలు పంపిణీ చేయాలని సభ్యులు కోరారు. ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు.జిలుగులు కావాలని సభ్యులు కోరగా అందుబాటులో లేవని తెలిపారు. ఈ ఏడాది 5121మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా వారికి. సంబంధించిన విద్య సామాగ్రిని సకాలంలో అందించాలన్నారు. చింతకుంటవాండ్లపల్లె వద్ద ఏర్పాటు చేసిన లే ఔట్‌ను సిద్ధం చేస్తే అర్హులైన వారికి పట్టాలు పంపిణీ చేయవచ్చునని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు.సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు ఎప్పటికప్పుడ ఈ గ్రామాలలో అందుబాటులో ఉండాలని అన్నారు.దోమల నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలి అని సభ్యులు సూచించారు. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో గొర్రెలు, మేకలు, పశువులకు రోగాలు వచ్చే అవకాశం ఉన్నందున టీకాలు వేయించాలని, ఇన్స్యూరెన్స్ చేయించేలా చూడాలన్నారు. టౌన్ పరిధిలోని నలంద నగర్ ఏరియాలో నీళ్ళు సరిగ్గా రావడం లేదు అని సభ్యులు తెలిపారు. తల్లి తండ్రులు లేని అనాథ పిల్లలను బాలసదనం స్కూల్ చేర్పించే సదుపాయం కల్పించాలని సభ్యులు ఐసీడీఎస్ సిబ్బంది కి సూచించారు. ఈ మధ్య కురిసిన వర్షానికి, గాలులకు గ్రామాలలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి కావున వెంటనే వాటి స్థానం లో కొత్తవి ఏర్పాటు చేసి ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సభ్యులు తెలిపారు.పాల్గొన్నారు.ఉద్యాన శాఖ ద్వారా రైతులకు కత్తెర్లు,రాంపాలు, అందించాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను ప్రథమ స్థాయికి తీసుకెళ్లేందుకు అడుగులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ లో విద్యా వ్యవస్థను ప్రథమ స్థాయికి తీసుకెళ్లేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అడుగులు వేస్తున్నారని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని స్థానిక టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అథమ స్థాయిలో ఉన్న విద్యా వ్యవస్థను ప్రథమ స్థాయికి తీసుకువెళ్లే దిశగా మంత్రి అడుగులు వేస్తున్నారన్నారు. ఏ మంత్రి అయినా తన శాఖ బాధ్యతలు స్వీకరించిన వెంటనే అధికారులతో మొదటగా సమీక్షలు నిర్వహించడం చూశామని చెప్పారు. కాని నారా లోకేశ్ మాత్రం విద్యాశాఖ మంత్రిగా ప్రమాణం చేసిన వెంటనే గ్రౌండ్ రియాలిటి తెలుసుకునేందుకు విద్యార్థి సంఘాలతో మొదటి సమీక్ష నిర్వహించడం దేశంలోనే మొట్ట మొదటి సారిగా చూసామన్నారు. ఈ ఒక్క సంఘటనతో లోకేశ్ విద్యా శాఖను ఎంతగా పటిష్టపరుస్తారో తెలిసిపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు విశ్వనాథ్, ఫరీద్, తౌసిఫ్ పాల్గొన్నారు.

అమ్మ కోసం మొక్కను నాటండి


ప్రజాశక్తి - పులివెందుల రూరల్

భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు అమ్మ కోసం ఒక మొక్కను నాటండి అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం నూతన మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు వంగల శశి భూషణ్‌రెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భాను, అసెంబ్లీ కన్వీనర్ మహేష్, సుష్మ, వై.నవీన్, రాజశేఖర్, శ్రీరాములు, లక్ష్మీదేవి, లక్ష్మయ్య, వాజ్‌పేయి, మురళి, టీవీఎస్ భాస్కర్, విష్ణు పాల్గొన్నారు.

ఎల్ఐసి కార్యాలయాన్ని ఆధునీకరించడం సంతోషకరం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడపలో ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం ప్రారంభించి 47 సంవత్సరాల అయిందని, డిజిటల్ సేవలు లక్ష్యంగా డివిజనల్ కార్యాలయాన్ని సెంట్రలైజ్డ్ ఎసి సేవలతో ఆధునీకరించుకోవడం సంతోషి ంచదగ్గ విషయమని జోనల్ మేనేజర్లు ఎల్. కె.శ్యామసుందర్, పునీత్ కుమార్ అన్నారు. సోమవారం ఆధునీ కరించబడ్డ డివిజనల్ కార్యాలయాన్ని జ్యోతి ప్రజ్వలనంతో వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కస్టమర్ల ఆకాంక్షలు పెరిగాయని, వారికి డిజిటల్ సేవలందించే దిశగా పయని స్తున్నామన్నారు. పాలసీదారులతో దృఢమైన బంధం దిశగా జవాబు దారీతనంతో కూడిన సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఏజెంట్స్ రిక్రూట్మెంట్ రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున చేపడతామని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్, ఇంజినీరింగ్ అధికారులు శ్రీనివాస్, సుదర్శన్ రెడ్డి, డివిజనల్ మేనేజర్లు సత్య శ్రీనివాస్, సత్యప్రసాద్, చలపతి, చంద్రకళ సంఘాల నాయకులు ఎల్లారెడ్డి, సంజయ్, రఘునాథరెడ్డి, ఆనందరావు, రెడ్డి భాస్కర్, సుధీకర్, సేల్స్ మేనేజర్ సాల్మన్ రాజు, ప్రోడక్ట్ మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న జోనల్ మేనేజర్లు

క్రైం కార్నర్

కారు ఢీకొని గ్రీన్ అంబాసిడర్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-రామాపురం

రామాపురం మండలం గువ్వల చెరువు సచివాలయంలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న రెడ్డి నాయక్ కర్నూలు - చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథల మేరకు.. రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ సుగా బిడికి గ్రామానికి చెందిన బుక్కే రెడ్డి నాయక్ గువ్వలచెరువు గ్రామ సచివాలయంలో గ్రీన్ అంబాసిస్ గా పని చేస్తున్నారు. నిచ్చెన తీసుకొని రోడ్డు దాటుతూ ఉండగా కడప వైపు నుంచి రాయచోటి వైపు వెళ్తున్న కారు ఢీ కొనడంతో రెడ్డి నాయక్‌కు తలపై తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకుని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.ఎల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

చేపల వేటకు వెళ్లి రైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బి.కొత్తకోట సిఐ సూర్యనారాయణ కథనం మేరకు పిటిఎం మండలం,రాపూరివాండ్ల పల్లె పంచాయతీ, ఉప్పరవాండ్లపల్లెకు చెందిన వెంకటస్వామి కుమారుడు ఎస్.నాగరాజ (50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు.ఈ నేపథ్యంలో శనివారం చేపల వేటకోసం బి.కొత్తకోట మండలంలోని ఆలేటి వాగుకు వెళ్ళాడు.చేపలు వేటాడుతుండగా ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందాడన్నారు. సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీయించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ వెల్లడించారు.